లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

భద్రాద్రి జిల్లా వైద్యాధికారి భాస్కర్‌నాయక్

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో భాస్కర్ నాయక్

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 16 (నమస్తే తెలంగాణ) : ప్రైవేటు ఆస్పత్రుల్లో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని భద్రాద్రి జిల్లా వైద్యాధికారి భాస్కర్‌నాయక్ హెచ్చరించారు. కొత్తగూడెంలోని తన కార్యాలయంలో గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం-1994పై అడ్వైజరీ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, సరైన కారణం లేకుండా అబార్షన్ చేసినా వారిపై కూడా కఠిన చర్యలు ఉంటాయన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ఐయూసీ మెటీరియల్ ప్రింట్ చేసి పంపిణీ చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంసీహెచ్ పీవో డాక్టర్ చైతన్య, డాక్టర్ అనూష, న్యాయవాది పార్వతి, డాక్టర్ కోరా శ్రీయాదవ్, ఎండీ అజ్గర్ హుస్సేన్, మొహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా బదిలీల ప్రక్రియ

కౌన్సిలింగ్‌లో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ

భద్రాచలం, జూలై 16 : ప్రభుత్వ నిబంధనల మేరకు జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించినట్లు ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ తెలిపారు. మంగళవారం పీఎంఆర్సీ భవనంలోని సమావేశ మందిరంలో ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు అధికారుల కమిటీ, నాల్గవ తరగతి ఉద్యోగుల కమిటీ సభ్యుల సమక్షంలో బదిలీల ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధల ప్రకారం 40 శాతం సిబ్బందికి బదిలీ చేయాల్సి ఉండగా.. 81 మందిని బదిలీ చేశామని పేర్కొన్నారు. బదిలీల ప్రక్రియలో భార్యాభర్తలు, దివ్యాంగులు, ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఎదుర్కొనేవారు, వితంతు మహిళలకు ప్రాధాన్యత ఇచ్చి కౌన్సిలింగ్ నిర్వహించామన్నారు. ఎలాంటి పొరపాట్లకు చోటు లేకుండా అందరూ సంతృప్తి చెందేలా బదిలీల ప్రక్రియను పూర్తి చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఏసీఎంవో రమణయ్య, ఏటీడీవో నర్సింహారావు, చంద్రమోహన్, రాధమ్మ, పర్యవేక్షకురాలు ప్రమీలాబాయి, సిబ్బంది రమణమూర్తి, నారాయణ, రంగయ్య, అశోక్, సురేశ్, శ్రీధర్, శేఖర్, రమణ, రమాదేవి పాల్గొన్నారు.

తాలిపేరు @ 72 అడుగులు

నేటి నుంచి పంట కాల్వలకు నీటి విడుదల

చర్ల, జూలై 16 : మొన్నటి వరకు వర్షాలు లేక.. నీరు రాక వెలవెలబోయిన తాలిపేరు రిజర్వాయర్ కొత్త నీటితో జలకళను సంతరించుకుంది. జిల్లాలో అడపా దడపా వర్షాలు కురిసినా.. ఎగువనున్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కురిసిన వర్షాలకు వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 74 అడుగులు ఉండగా.. 72 అడుగులకు నీరు చేరింది. దీంతో ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురించాయి. ఇప్పటివరకు బావులు, బోర్ల కింద వరి నార్లు పోసుకున్న రైతులు ప్రాజెక్టులోకి నీరు చేరడంతో ఆనందపడుతున్నారు. ఆయకట్టు రైతుల అభ్యర్థన మేరకు అధికారులు కాల్వల ద్వారా బుధవారం నుంచి నీటిని విడుదల చేసేందుకు చర్యలు చేపట్టారు.

'తొక్కే కదా' అని తీసిపారేయలేదు..

- **జామాయిల్ వ్యర్థానికీ ఓ అర్థం ఉందని చాటిచెప్పాడు..**

యంత్రంలో నుజ్జునుజ్జు అవుతున్న జామాయిల్ తొక్క

జామాయిల్ తొక్కను సేకరిస్తున్న కూలీలు

అశ్వారావుపేట రూరల్, జూలై 16 : 'పుర్రెకో బుద్ధి.. జిహ్వాకో రుచి..' అన్నారు పెద్దలు. చాలా మందిలాగా అతడు కూడా ఈ నానుడిని ఇలా విని అలా వదిలేయలేదు. 'పుర్రెకో బుద్ధి..' అనే పదానికి ఉన్న పరమార్థం నిజంగా అతడి పుర్రెకు తట్టినట్లుగా ఉంది. దాదాపుగా భద్రాద్రి జిల్లా ప్రజలకు, రైతులకు సుపరిచితమైన జామాయిల్ పంట విషయంలో అతడి పుర్రెలో పుట్టిన బుద్ధి.. అతడితోపాటు మరో నలుగురికి ఆదాయమార్గాన్ని తెచ్చిపెట్టింది. అదే.. జామాయిల్ తొక్క. అతడే.. సారపాకకు చెందిన జలాల్.

కాగితపు ఉత్పత్తికి ప్రధాన ముడిసరుకు జామాయిల్. సారపాకలోని ఐటీసీ కాగితపు కర్మాగారం ఈ జిల్లాలోని రైతుల నుంచి జామాయల్ కొనుగోలు చేస్తుంటుంది. ఈ పరిశ్రమకు విక్రయించేందుకు చాలామంది రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారు. జామాయిల్ మొక్కలు నాటాక మూడేళ్ల తరువాత చెట్లు ఏపుగా పెరుగుతాయి. పేపర్ తయారీకి అనుకూలమైన సైజ్, పక్వంతో కాండం వస్తుంది. ఆ కాండాన్నే బాజు, సైజు పుల్ల అంటారు. అనువైన సైజుకు పెరిగిన జామాయల్ కర్రను ఐటీసీ కాంట్రాక్టర్లు కొనుగోలు చేస్తారు. వారు తమ కూలీల ద్వారా రైతుల చేలల్లోకి వచ్చి సైజుల ప్రకారం జామాయిల్ చెట్లను కటింగ్ చేస్తారు. ఆ తరువాత ఆ సైజు పుల్లలకు తొక్క తీస్తారు. ఆ తొక్కను అక్కడే పడేస్తారు. తొక్క తీసిన సైజు పుల్లలను లారీలు, ట్రాక్టర్లలో లోడ్ చేసుకొని వెళ్తారు. అయితే కొన్నాళ్లకు ఆ తొక్క పూర్తిగా ఎండిపోతుంది. దీంతో రైతులు దానిని కాల్చివేస్తారు. కానీ జలాల్ మాత్రం.. ఆ తొక్కను కాల్చివేతకు ఇవ్వడం లేదు. రోడ్ల వెంట, పొలాల వద్ద వ్యర్థంగా పడి ఉన్న జామాయిల్ తొక్కకు అర్థం చెబుతున్నాడు. కూలీల సహాయంతో ఆ తొక్కను సేకరిస్తున్నాడు. ట్రాక్టర్‌కు అమర్చి ఉన్న ఓ ప్రత్యేక యంత్రంలో జామాయిల్ తొక్కలను వేసి నుజ్జునుజ్జుగా చేస్తున్నాడు. కొన్నాళ్లు దానిని నిల్వ ఉంచి అటు అదే ఐటీసీలోని పవర్ ప్లాంటుకుగానీ, ఇటు ఇటుక బట్టీలకు గానీ విక్రయిస్తున్నాడు. ఇలా తాను ఉపాధి పొందుతూ తన పనిచేసే మరో నలుగురికి ఉపాధిని కల్పిస్తున్నాడు. అందుకే అతడు అందరిలా 'తొక్కే కదా..' అని తీసిపారేయలేదు.

వినియోగదారులే భాగస్వాములు

సింగరేణి సీఎండీ బలరాం

మాట్లాడుతున్న సీఎండీ బలరాం నాయక్

కొత్తగూడెం సింగరేణి, జూలై 16 : సింగరేణి సంస్థ తన వినియోగదారుల పట్ల స్నేహపూరితంగా వ్యవహరిస్తోందని, వారిని ప్రగతి భాగస్వాములుగా గుర్తిస్తోందని సింగరేణి సీఎండీ బలరాం అన్నారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో మంగళవారం ఈ-వేలం వినియోగదారులు, వ్యాపారుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సింగరేణి బొగ్గును వినియోగిస్తున్న సుమారు 80 కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొని తమ తరపున కొన్ని సూచనలు, సలహాలు చేశారు. దీనిపై సీఎండీ సానుకూలంగా స్పందించారు. బొగ్గు వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా.. సమాచార లోపం రాకుండా ఉండేందుకు ఒక ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అందులో తాను కూడా ఉంటానని, మీ సమస్యను తక్షణమే పరిష్కరిస్తానని చెప్పారు. సమావేశంలో జీఎం మార్కెటింగ్ దేవేందర్, ఏజీఎం ఎన్‌వీ.రాజశేఖర్, డీజీఎం రవివాత్సవ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చడమే బీజేపీ లక్ష్యం

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఆశించిన స్థాయిలో లేదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

మధిర రూరల్, జూలై 16 : భారత రాజ్యాంగాన్ని మార్చడమే బీజేపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మంగళవారం దెందుకూరులో జరిగిన ఆ పార్టీ జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీని ఓడించడమే సీపీఎం ప్రధాన లక్ష్యమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలన ఆశించిన స్థాయిలో లేదన్నారు. బీజేపీ మతోన్మాదం దేశానికి పెను ప్రమాదమన్నారు. తెలంగాణ రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ చేయాలని, పంట రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను సీపీఎం పార్టీ వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు బుగ్గవీటి సరళ, నున్నా నాగేశ్వరరావు, భూక్యా వీరభద్రం, పొన్నం వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, భారతి, రాంబాబు, విక్రమ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యేక అవగాహనకు ప్రణాళికలు

భద్రాచలం ఆర్డీఓ దామోదరరావు

మాట్లాడుతున్న ఆర్డీవో దామోదరరావు

భద్రాచలం, జూలై 16 : గోదావరి వరదల సమయంలో ముంపు ప్రాంతాల్లో విధులు నిర్వహించే అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముందస్తు అవగాహనకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని భద్రాచలం ఆర్డీఓ దామోదరరావు ఆదేశించారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జాతీయ విపత్తుల స్పందన దళం సారథ్యంలో గోదావరి వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏడు మండలాల తహసీల్దార్లు, సెక్టోరియల్ అధికారులు, పోలీస్ శాఖ అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ముంపునకు గురయ్యే మండలాలు, గ్రామాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ఎన్డీఆర్ఎఫ్ తరపున ఏడు మండలాల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గోదావరి వరదలు గ్రామాల్లోకి రాకముందే తీసుకోవాల్సిన కార్యాచరణ, వరదల్లో గ్రామాలు మునిగితే తీసుకోవాల్సిన చర్యలపై ఎన్డీఆర్ఎఫ్ దళం అధికారులకు సహాయం అందిస్తారని చెప్పారు. ముఖ్యంగా ప్రాణనష్టం, పశునష్టం జరుగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎన్డీఆర్ఎఫ్ దళం అధికారులు నిర్వహించే అవగాహన సదస్సులో వారు ఇచ్చే సలహాలు, సూచనలు తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎన్డీఆర్ఎఫ్ దళ కమాండర్ భూపేందర్‌కుమార్, ఏడు మండలాల తహసీల్దార్లు, సీఐలు, ఎస్సైలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు వెళ్లమన్నందుకు విద్యార్థిని ఆత్మహత్య

గుండాల, జూలై 16: పాఠశాలకు వెళ్లి చదువుకోవాలని కుటుంబ సభ్యులు మందలించడంతో ఓ విద్యార్థిని పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం సాయనపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తోలెం నిహారిక (13) ఒకటి నుంచి 7వ తరగతి వరకు స్థానిక పాఠశాలలోనే విద్యను అభ్యసించింది. 8వ తరగతి మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో చదువుతోంది. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం హోమ్ సిక్‌పై ఇంటికి వెళ్లింది. తర్వాత పాఠశాలకు వెళ్లాలని కుటుంబ సభ్యులు మంగళవారం మందలించారు. దీంతో వ్యవసాయం కోసం తెచ్చిన పురుగుల మందును ఇంట్లోనే సేవించింది. గమనించిన కుటుంబ సభ్యులు సమాచారం అందించడంతో 108 వాహనంలో గుండాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం మళ్లీ 108 వాహనంలో కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై రాజమౌళి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై అత్యాచారం

- **తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు**
- **నిందితుడిని కోర్టులో అప్పగించిన పోలీసులు**

రఘునాథపాలెం, జూలై 16 : మాయమాటలు చెప్పి ఓ మైనర్ బాలికను లాడ్జికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఖమ్మం జిల్లా ఖానాపురం హవేలీ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. సీఐ భానుప్రకాశ్ తెలిపిన ప్రకారం.. ఖమ్మం నగరం ఖానాపురానికి చెందిన పులి బిశ్వజిత్ అనే బీటెక్ విద్యార్థి ఖమ్మంలోని ఓ మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి నగరంలోని ఓ లాడ్జికి తీసుకెళ్లి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఆమె తల్లిదండ్రులకు తెలపడంతో వారి ఫిర్యాదు మేరకు బిశ్వజిత్‌పై కేసు నమోదు చేసి.. రిమాండ్ నిమిత్తం కోర్టుకు అప్పగించినట్లు తెలిపారు. అలాగే లాడ్జి నిర్వాహకుడిపైనా కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడు ప్రస్తుతం ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి గ్రామంలోని రాజీవ్‌నగర్ గృహకల్పలో నివాసం ఉంటున్నట్లు సీఐ వివరించారు.

సంక్షిప్త వార్తలు

• స్విగ్గీ, జొమాటోలో మద్యం డోర్ డెలివరీ!

న్యూఢిల్లీ, జూలై 16: నచ్చిన ఫుడ్‌ను స్విగ్గీ, జొమాటోలలో తెప్పించుకున్నట్టే.. ఇకపై మద్యాన్ని (పరిమిత స్థాయిలో) కూడా డోర్ డెలివరీ ద్వారా తెప్పించుకునే రోజు త్వరలో రాబోతున్నది. మనకు నచ్చిన మద్యం బ్రాండ్‌ను ఆన్‌లైన్ యాప్‌లో ఆర్డర్ చేసి పొందవచ్చు! న్యూఢిల్లీ, కర్ణాటక, హర్యానా, పంజాబ్, తమిళనాడు, గోవా, కేరళలలో పైలట్ ప్రాజెక్ట్ కింద అమలుజేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ-కామర్స్ సంస్థలతో మద్యం తయారీ సంస్థలు చర్చలు జరుపుతున్నాయని పరిశ్రమ వర్గాలు మంగళవారం మీడియాకు వెల్లడించాయి.

• భారత మార్కెట్‌లోకి ఒబెసిటీ డ్రగ్ టర్‌జెపటైడ్!

న్యూఢిల్లీ, జూలై 16: బరువు తగ్గటంలో అద్భుత ఔషధంగా భావిస్తున్న 'టర్‌జెపటైడ్' ఔషధం.. త్వరలో భారత్‌లోనూ అందుబాటులోకి రాబోతున్నది. భారత్‌లో ఈ ఔషధం అమ్మకాలకు సంబంధించి ఫార్మా కంపెనీ 'ఇలి లిల్లీ'కి కేంద్రం త్వరలోనే గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నది. ఈ ఔషధాన్ని ఇండియాలో టైప్-2 డయాబెటిస్ రోగుల చికిత్స కోసం ప్రధానంగా వాడాలని సూచిస్తున్నా, ఒబెసిటీతో బాధపడుతున్న వారికి దీనిని ఉపయోగించవచ్చునని నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ ఔషధాన్ని పెద్ద మొత్తంలో తీసుకున్న రోగుల్లో సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉన్నాయని ప్రపంచవ్యాప్తంగా జరిగిన క్లినికల్ ట్రయల్స్ చెబుతున్నాయి. భారత్‌లోని డ్రగ్ రెగ్యులేటరీ నిపుణుల కమిటీ కొద్ది రోజుల క్రితం 'టర్‌జెపటైడ్' ఔషధం అమ్మకాలకు ప్రాథమికంగా ఆమోదం తెలిపినట్టు సమాచారం.

• అనారోగ్యకర ఆహారాన్ని నిషేధించండి: యూజీసీ

న్యూఢిల్లీ: ఉన్నత విద్యా సంస్థలలో అనారోగ్యకరమైన ఆహార పదార్థాల అమ్మకాన్ని నిషేధించాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) అడ్వైజరీ జారీ చేసింది. ప్రస్తుతం దేశంలో అనారోగ్యకరమైన ఆహార అలవాట్ల కారణంగానే ప్రతి నలుగురిలో ఒకరు ఊబకాయం, మధుమేహం వంటి వ్యాధులతో బాధపడుతున్నారని ఐసీఎంఆర్ నివేదికలో పేర్కొన్న విషయాన్ని గుర్తు చేసింది.

దక్షిణ మధ్య రైల్వే

Follow us on @SCRailwayindia

ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును.

ప్రొఫార్మా 10-01

బహిరంగ ప్రకటన

PUB/0681

దక్షిణ మధ్య రైల్వే లోని దిగువ సూచించిన సెక్షన్ యొక్క పూర్తి చెయ్యబడిన సెక్షన్ పైగల రైల్వే లైన్లు మరియు ఆవరణలు ఉపయోగించు వారందరికీ ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది: 25000 ఓల్టులు, 50HZ, A.C. ఓవర్‌హెడ్ ట్రాక్షన్ వైర్ల నందు సెక్షన్‌కు ఎదురుగా తెలిపిన తేదీన లేదా ఆ తర్వాత విద్యుత్తు సరఫరా జరుగును. సదరు తేదీన మరియు సదరు తేది నుండి అన్ని వేళలా ఓవర్‌హెడ్ ట్రాక్షన్ లైన్లలో విద్యుత్తు సరఫరా జరుగుతున్నట్లుగా పరిగణించబడును మరియు అనధీకృత వ్యక్తి ఎవరూ సదరు ఓవర్ హెడ్ లైన్స్ సమీపంలో ప్రవేశించరాదు లేదా పనిచేయరాదు.

సెక్షన్	తేది
సికింద్రాబాద్ డివిజన్‌లోని భద్రాచలం రోడ్ మరియు మనుగూరు సెక్షన్ మధ్య ఒహెచ్ఇ మాస్ట్ లోకేషన్ 81/16 నుండి 102/16 వరకు పాండురంగాపురం మరియు మనుగూరు స్టేషన్ల మధ్య కొత్త ఫీడర్ వైర్ నందు విద్యుత్ సరఫరా జరుగును	17.07.2024

AC 25KV ట్రాక్షన్ యొక్క ప్రారంభం

ప్రొఫార్మా 10-02

"రహదారి వినియోగదారులకు హెచ్చరిక"

దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ డివిజన్‌లో భద్రాచలం రోడ్ మరియు మనుగూరు సెక్షన్ మధ్య ఒహెచ్ఇ మాస్ట్ లోకేషన్ 81/16 నుండి 102/16 వరకు పాండురంగాపురం మరియు మనుగూరు స్టేషన్ల మధ్య కొత్త ఫీడర్ వైర్ కొరకు 25KV AC యొక్క ప్రారంభానికి సంబంధించి ప్రజలకు సమాచారమిచ్చు నిమిత్తం ఈ విధంగా ప్రకటించడమైనది, లైవ్ ట్రాక్షన్ వైర్ యొక్క ప్రమాదకర సమీపానికి వెళ్లకుండా అత్యధిక ఎత్తుగల లోడ్స్‌తో వెళ్ళు వాహనములను నివారించు నిమిత్తం రోడ్డు లెవల్‌కు ఎగువన 4.67 మీటర్ల స్పష్టమైన గరిష్ట ఎత్తుతో అన్ని లెవల్ క్రాసింగ్స్ వద్ద హైట్‌గేజ్‌లు స్థాపించబడినవి.

లోడ్‌తో వెళ్లు వాహనముల యొక్క కార్యార్థం కొరకు పైన నిర్దిష్టపరచిన ఎత్తుని గమనించవలసిందిగా మరియు రహదారి వాహనములనందు తీసుకెళ్లు లోడ్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ హైట్ గేజ్‌లను అతిక్రమించ రాదని ప్రజలకు ఇందుమూలంగా ప్రకటించడమైనది.

అత్యధిక ఎత్తుతో కూడిన లోడ్‌తో వెళ్లినచో సంభవించే ప్రమాదాలు దిగువ విధంగా ఉంటాయి:

1. హైట్‌గేజ్‌కు ప్రమాదం మరియు తదుపరి రహదారికి మరియు అలాగే రైల్వే లైన్‌కు అవరోధం కలుగుతుంది.
2. వాహనములపై తీసుకెళ్ళు సామాగ్రికి లేదా పరికరాలకు లేదా వాహనములకు సైతం ప్రమాదం సంభవించవచ్చు.
3. కండక్టర్లను తాకుట లేదా వాటి యొక్క ప్రమాదకర సమీపానికి వెళ్లు కారణంగా అగ్ని ప్రమాదం సంభవించవచ్చు మరియు ప్రాణాంతకం కావచ్చు. **విద్యుత్ సరఫరా జరుగు తేది: 17-07-2024**

A0872 **సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ (ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్) సికింద్రాబాద్.**

మళ్లీ చలో ఢిల్లీ

మరోసారి ఢిల్లీ ర్యాలీకి సిద్ధమైన రైతు సంఘాలు

శంభు వద్ద బారికేడ్లను తొలగించగానే ముందుకు

డిమాండ్లు సాధించే వరకు ఉద్యమం ఆపేది లేదు

బీకేయూ నేత జగ్జిత్ సింగ్ దల్లేవాల్ స్పష్టీకరణ

చండీగఢ్/ఛత్రపతి శంభాజీనగర్, జూలై 16: దేశ రాజధాని ఢిల్లీ సరిహద్దుల్లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి. రైతుల 'ఢిల్లీ చలో' సందర్భంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో హర్యానాలో అంబాలా సమీపంలోని శంభు సరిహద్దు వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన బారికేడ్లు, ఇతర దిగ్బంధనాలను తొలగించిన తర్వాత.. మరోసారి ఢిల్లీకి ర్యాలీ చేపట్టేందుకు రైతు సంఘాలు సిద్ధమయ్యాయి. శంభు సరిహద్దు వద్ద జాతీయ రహదారిని తెరిచిన వెంటనే రైతులు మళ్లీ చలో ఢిల్లీ చేపడుతారని భారతీయ కిసాన్ యూనియన్ ఏక్తా సిద్ధూపూర్, సంయుక్త కిసాన్ మోర్చా(నాన్ పొలిటికల్) నేత జగ్జిత్ సింగ్ దల్లేవాల్ మంగళవారం వెల్లడించారు. పంటలకు కనీస మద్దతు ధర, ఇతర డిమాండ్ల పరిష్కారం అయ్యేంత వరకు రైతాంగ ఉద్యమం ఆగేది లేదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రయాణికుల అసౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని శంభు సరిహద్దు వద్ద రహదారిపై ఏర్పాటు చేసిన బారికేడ్లను వారం రోజుల్లో తొలగించాలని పంజాబ్-హర్యానా హైకోర్టు ఇటీవల హర్యానా ప్రభుత్వాన్ని ఆదేశించిన నేపథ్యంలో దల్లేవాల్ ఈ మేరకు ప్రకటన చేశారు. ఫిబ్రవరిలో ఎస్కేఎం(నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా(కేఎంఎం) ఆధ్వర్యంలో రైతులు చేపట్టిన 'ఢిల్లీ చలో'ను పోలీసులు పంజాబ్-హర్యానాలోని శంభు సరిహద్దు వద్ద అడ్డుకోవడంతో ఆ నెల 13 నుంచి రైతులు అక్కడే బైఠాయించి ఆందోళనలు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే.

జంతర్‌మంతర్ లేదా రామ్‌లీలా మైదానంలో..

ర్యాలీగా ఢిల్లీ చేరిన తర్వాత జంతర్‌మంతర్ లేదా రామ్‌లీలా మైదానంలో శాంతియుత ఆందోళనలు కొనసాగిస్తామని జగ్జిత్ సింగ్ దల్లేవాల్ వెల్లడించారు. బారికేడ్ల తర్వాత తాము కొనసాగించే ర్యాలీని మళ్లీ అడ్డుకొన్నా, రోడ్డును దిగ్బంధించినా ప్రభుత్వానిదే బాధ్యత అని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ ఏడాది మార్చిలో ఆందోళనల సందర్భంగా పోలీసులు అరెస్టు చేసిన నవదీప్ సింగ్‌కు సంఘీభావంగా బుధ, గురువారాల్లో శాంతియుత ఆందోళనలు చేపడుతామని తెలిపారు. నవదీప్ సింగ్‌పై పోలీసులు అల్లర్లు, హత్యాయత్నం వంటి తీవ్రమైన అభియోగాలు మోపారు. హైకోర్టు ఆదేశాలను హర్యానా ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేయడంపై దల్లేవాల్ స్పందిస్తూ.. రోడ్డును బ్లాక్ చేసింది ప్రభుత్వమేనని, రైతులు కాదని అన్నారు. ఫిబ్రవరిలో రైతులు, పోలీసులకు మధ్య జరిగిన ఘర్షణల్లో మరణించిన రైతు శుభకరణ్ సింగ్ మృతిపై దర్యాప్తునకు ఏర్పాటు చేసిన కమిటీపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు.

ఎంఎస్పీ పెంచక ఇబ్బందుల్లో చక్కెర పరిశ్రమ

కేంద్ర ప్రభుత్వం గత ఐదేండ్లుగా మద్దతు ధరను పెంచకపోవడంతో దేశంలోని చక్కెర పరిశ్రమ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని షుగర్ యూనిట్స్ ఫెడరేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కోఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీస్ లిమిటెడ్ డైరెక్టర్ జైప్రకాశ్ దండేగోంకర్ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ కేంద్రం త్వరితగతిన నిర్ణయాలు తీసుకోకపోవడంతో షుగర్ ఇండస్ట్రీలో వర్కింగ్ క్యాపిటల్‌లో స్వల్ప మార్జిన్లు, అప్పులు వంటి సమస్యలు మళ్లీ తలెత్తే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం చెరకు ఎఫ్ఆర్‌పీని మూడుసార్లు పెంచిందని, అయితే చక్కెరకు ఎంఎస్పీని పెంచలేదని పేర్కొన్నారు. గత ఐదేండ్లుగా అన్ని రాష్ట్రాల ఫెడరేషన్లు డిమాండ్ చేస్తున్నా, ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన లేదని విమర్శించారు. చెరకు, రవాణా, లేబర్ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో చక్కెర ఉత్పత్తి ఖర్చుగా కేజీకి కనీసం రూ.41 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

ఒమన్ తీరంలో ఓడ బోల్తా

- **16 మంది ఆచూకీ గల్లంతు**
- **వీరిలో 13 మంది భారతీయులు**

మస్కట్, జూలై 16: ఒమన్ తీరంలో చమురు ట్యాంకర్లతో ప్రయాణిస్తున్న ప్రెస్టీజ్ ఫాల్కన్ అనే ఓడ సోమవారం బోల్తా పడింది. ఈ ఓడలో ఉన్న 16 మంది సిబ్బంది గల్లంతయ్యారని ఒమన్ మారిటైమ్ సెక్యూరిటీ సెంటర్(ఎంఎస్‌సీ) తెలిపింది. ఇందులో 13 మంది భారతీయులు కాగా, మరో ముగ్గురు శ్రీలంకకు చెందిన వారుగా గుర్తించారు. వీరి ఆచూకీ కోసం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నది. కొమొరోస్‌కు చెందిన ఈ ఓడ యెమన్‌లోని ఓడరేవు నగరమైన ఏడెన్‌కు వెళ్తున్నట్టు తెలిసింది. రాయ్ మద్రకహ్‌కు ఆగ్నేయం వైపు 25 నాటికల్ మైళ్ల దూరంలో ఈ ఘటన జరిగింది. ఓడ బోల్తా పడటానికి కారణం ఇంకా తెలియరాలేదు. ఓడ ఆచూకీ కోసం గాలింపు చర్యలు జరుగుతున్నాయి.

మస్కట్‌లో మసీదు వద్ద కాల్పులు.. భారతీయుడు మృతి

మసీదు లక్ష్యంగా ఒమన్ రాజధాని మస్కట్‌లో దుండగులు జరిపిన కాల్పుల్లో ఆరుగురు మరణించగా, 50 మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో ఒకరు భారతీయుడు, నలుగురు పాకిస్థానీయులు ఉన్నారు. కాల్పులకు పాల్పడ్డ వారిలో ముగ్గురు దుండగులను కాల్చి చంపినట్టు పోలీసులు తెలిపారు. వాడీ కబీర్ ప్రాంతంలోని ఇమామ్ అలీ మసీద్ బయట సోమవారం రాత్రి స్థానికులు మతపరమైన వేడుక జరుపుకుంటుండగా ఈ కాల్పులు జరిగాయి. మృతి చెందిన భారతీయుని కుటుంబానికి సహాయ సహకారాలను అందించనున్నట్టు భారత రాయబార కార్యాలయం పేర్కొంది.

కూలీలుగా వేషం మార్చి.. దొంగల ముఠా ఆట కట్టించి

- **పుణె పోలీసుల రహస్య ఆపరేషన్**
- **చోరీకి గురైన 100 బైకులు స్వాధీనం**

ముంబై, జూలై 16: వ్యవసాయ కూలీలుగా మారు వేషం ధరించిన పోలీసులు, పుణె చుట్టుపక్కల వాహనాల్ని దొంగలిస్తున్న ముఠాను అత్యంత చాకచక్యంగా పట్టుకున్నారు. గత ఏడాది మార్చి-ఏప్రిల్‌లో పుణె పోలీస్ క్రైం బ్రాంచ్‌లోని ఏడుగురు సభ్యులు రహస్య ఆపరేషన్ చేపట్టి.. దొంగల ముఠాలో ప్రధాన వ్యక్తి అజయ్ రమేశ్ షిండేను పట్టుకున్నారు. దొంగతనం చేసిన 100 బైకులను స్వాధీనం చేసుకొని.. నెల రోజులపాటు ఆరా తీయగా, ఓ కామర్స్ గ్రాడ్యుయేట్ నేతృత్వంలో నలుగురు వ్యక్తులు గ్యాంగ్‌గా ఏర్పడి చేస్తున్న తతంగం బయటపడింది. దొంగలించిన వాహనాల్ని దారాశివ్, లాతూర్, బీద్ జిల్లాల్లో గ్రామస్థులకు అమ్ముతున్నట్టు పోలీసు విచారణలో తేలింది. రహస్య ఆపరేషన్‌లో భాగంగా కూలీలుగా మారిన పోలీసులు.. పొలాల్లో వంట చేసుకుంటూ, స్థానికులతో కలిసి కొన్ని సార్లు కూలి పనులకు కూడా వెళ్లారని తెలిసింది.

యూపీలో ముదురు జంట ప్రేమ

10 మంది పిల్లలున్న వ్యక్తితో ఆరుగురు సంతానం ఉన్న మహిళ జంప్

కాస్‌గంజ్: ప్రేమ గుడ్డిది అంటుంటారు. ఇది యువత విషయంలో నిజమైనా.. తాము కూడా తక్కువ కామని యూపీలో ఒక ముదురు ప్రేమజంట నిరూపించింది. సాక్షాత్తూ పెళ్లయ్యి 10 మంది పిల్లలున్న వ్యక్తి... పెళ్లయ్యి ఆరుగురు సంతానం ఉన్న మరో మహిళతో కలిసి ప్రేమాయణం సాగించి ఇద్దరూ జంప్ కావడం ఆశ్చర్యమైతే.. ఆ మహిళ తన కుమారుడి కాబోయే అత్త కావడం మరో ట్విస్టు. యూపీలోని కాస్‌గంజ్‌లో కూలిపని చేసుకునే వ్యక్తి, ఈ-రిక్షా డ్రైవర్‌గా చేసే షకీల్ 28 ఏండ్లుగా స్నేహితులు. తన కుమారుడికి అతని కుమార్తెనిచ్చి చేద్దామని షకీల్ అడగడంతో ఆయన కూడా అంగీకరించాడు. జూన్ 17న వివాహం చేద్దామని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో షకీల్, స్నేహితుని భార్య తరచూ మాట్లాడుకునే వారు. ఈ లోగా ఇరు కుటుంబాలకు షాక్ ఇస్తూ జూన్ 3న షకీల్, పెళ్లికుమార్తె తల్లి(35) లేచిపోయారు. 10 మంది సంతానం ఉన్న షకీల్, ఆరుగురు పిల్లలున్న పెండ్లి కుమార్తె తల్లి ఇలా చేయడం చూసి బంధువులు, చుట్టుపక్కల వారు ముక్కున వేలుసుకున్నారు. కాగా, పెండ్లి కుమార్తె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారిద్దరూ ఈ ముదురు ప్రేమ జంట కోసం గాలిస్తున్నారు.

సైబర్ నేరగాళ్ల నుంచి ఇలా రక్షణ!

ఐఫోన్ యూజర్లకు యాపిల్ సూచనలు

న్యూఢిల్లీ, జూలై 16: సైబర్ మోసాలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో మోసగాళ్ల వలకు చిక్కకుండా ఉండేందుకు ఐఫోన్ వినియోగదారులకు యాపిల్ సంస్థ పలు సూచనలు చేసింది. ఈ మేరకు కంపెనీ సెక్యూరిటీ డాక్యుమెంట్‌ను అప్‌డేట్ చేసింది. యాపిల్ సూచించిన జాగ్రత్తలు ఇవీ..

1. మోసపూరిత ఈమెయిళ్లను గుర్తించేందుకు గానూ ఈమెయిల్‌కు స్పందించే ముందు అది ఏ మెయిల్ ఐడీ నుంచి వచ్చిందనేది ధ్రువీకరించుకోవాలి.
2. 'మీ ఫోన్‌లో సెక్యూరిటీ సమ స్య ఉంది' అంటూ వచ్చే పాప్‌అప్ యాడ్లను క్లిక్ చేయవద్దు. ఇవి చాలా వరకు మోసపూరితమైనవి అయ్యే అవకాశం ఉంది.
3. 'యాపిల్ సపోర్ట్' పేరుతో మోసగాళ్లు ఫోన్లు, మెసేజ్‌లు చేయవచ్చు. వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలి.
4. ఉచితంగా లేదా ఏదైనా బహుమతి వచ్చిందని వచ్చే ప్రకటనలను నమ్మి మోసపోవద్దు.
5. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే 'క్యాలెండర్ ఇన్‌వైట్'లను తిరస్కరించాలి.
6. పాస్‌వర్డ్‌లు, సెక్యూరిటీ కోడ్‌లను తెలియని వెబ్‌సైట్‌లలో ఎంటర్ చేయొద్దు.
7. యాపిల్ ఐడీకి టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్ పెట్టుకోవాలి. కాంటాక్ట్ సమాచారాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి.
8. సాఫ్ట్‌వేర్‌ను కేవలం నమ్మకమైన మార్గాల్లో మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలి.

నీతి ఆయోగ్ పునర్వ్యవస్థీకరణ

న్యూఢిల్లీ, జూలై 16: కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన మోదీ ప్రభుత్వం మంత్రి మండలిలో మార్పుల తర్వాత మంగళవారం నీతి ఆయోగ్‌ను పునర్వ్యవస్థీకరించింది. ఇందులో చైర్ పర్సన్‌గా ప్రధాని నరేంద్ర మోదీ కొనసాగుతారు. వైస్‌చైర్మన్, పూర్తికాల సభ్యుల విషయంలో ఎలాంటి మార్పులు ఉండవు. వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కొత్త ఎక్స్ అఫీషియో సభ్యునిగా చేర్చగా, ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని నీతి ఆయోగ్‌లో భాగస్వాములను చేశారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ సవరించిన కూర్పు తర్వాత సుమన్ కే బెర్రీ వైస్‌చైర్మన్‌గా, వీకే సారస్వత్, రమేశ్ చంద్, వీకే పాల్, అరవింద్ విర్మనీలు పూర్తికాల సభ్యులుగా కొనసాగుతారు.

పూజా ఖేద్కర్ శిక్షణ నిలుపుదల



ముంబై, జూలై 16 (నమస్తే తెలంగాణ): ఇటీవల వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన ట్రైనీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేద్కర్ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకొన్నది. అడ్డదారుల్లో ఆమె ఐఏఎస్ ఉద్యోగం సంపాదించారన్న ఆరోపణలపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ట్రైనీ ఐఏఎస్‌గా మహారాష్ట్రలో వెంటనే శిక్షణను నిలిపివేసి జూలై 23లోపు తిరిగి ముస్సోరిలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌కు వెనక్కి రావాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఓ ప్రకటన విడుదల చేసింది. మరోవైపు పుణే కలెక్టర్ తనను వేధిస్తున్నారని ఖేద్కర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.